# రంభా-రాంబాబు కథ

- విశారద

''నీ సుపుత్రుడికి ఈ ఫోటో చూపించు. ఈ పిల్లయినా నచ్చుతుందేమో-'' అప్పుడే పోస్ట్‌లో వచ్చిన ఉత్తరాన్ని చదువుతూ, ఉత్తరంతోబాటు వచ్చిన ఫోటోని భార్య అనసూయకి అందిస్తూ అన్నాడు పరంధామయ్య.

భర్త అందించిన ఫోటోని తీరిగ్గా కుర్చీలో కూర్చునిమరీ పరిశీలించింది అనసూయ.

''పిల్ల మంచి రంగులావుంది. కన్ను ముక్కుతీరు కూడా బాగానే వున్నట్టుంది.'' కళ్ళజోడు సవరించుకుంటూ ఫోటోని పరిశీస్తున్న అనసూయని చూసాడు పరంధామయ్య.

''ఎలావుంది అమ్మాయి?'' అడిగాడు భార్యని.

''చక్కగావుంది'' ఫోటోవైపు నుండీ చూపు తిప్పుకోకుండానే బదులిచ్చింది అనసూయ.

''ఏం లాభం? నీ కొడుక్కి నచ్చాలిగా ముందు. అందరికీ ఏవో వంకలు పెట్టడం, పిల్ల నచ్చలేదనడం...'' ఉత్తరాన్ని మడచి జేబులో పెట్టుకుంటూ అన్నాడు.

''వాడేదో కావాలని వంకలు పెట్టి సంబంధాలన్నీ తిరగ్గొడుతున్నట్టుగా మాట్లాడారేంటి? వాడికి నచ్చిన అమ్మాయి దొరకొద్దా!'' అనసూయ భర్తవైపు కోపంగా చురచురా చూసింది.

''ఆ! దొరుకుతుంది. నీ పుత్రరత్నానికి అలాంటి లాంటి అమ్మాయిలు నచ్చుతారా? మంచి రంగు వుండాలట. పెద్దజడ వుండాలట. పెద్దకళ్ళు వుండాలట. నా శ్రాద్ధం- నా పిండాకూడూను! ఇలా అది, ఇది అని వెతుక్కుంటూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా గడచిపోయి ముదిరిన బ్రహ్మచారిని రేపొద్దున ఎవరూ చేసుకోరు'' తనూ కోపంగా చూస్తూ అన్నాడు పరంధామయ్య.

''ఆ! నాకొడుక్కేవీ అప్పుడే వయసు మించిపోలేదు లెండి. అయినా కాస్త అందంగావున్న పిల్ల కావాలంటున్నాడు వాడు. అదేం తప్పా?'' రుసరుసలాడింది అనసూయ.

''కాస్తా కూస్తా అందం చాలదటకదే నీ సుపుత్రుడికి. రంభలానో, ఊర్వశిలానో వుండాలట... అమ్మాయి సంసారపక్షంగావుందా లేదా అని చూసుకోవాలిగానీ, రంభలాగా, రమ్యకృష్ణలాగా వుండాలని కోరుకోవడమేవిటే వెర్రిపీనుగు కాకపోతే...''

''అనవసరంగా వాడినేమీ అనకండి. వాడికి పిల్ల నచ్చుందే ఎలా చేసుకుంటాడు?''

''నేను నిన్ను చేసుకోలా? అలాగే...''

''అంటే.. నేను అందంగా లేననేగా మీ ఉద్దేశ్యం. ఆరోజుల్లో ఎంతమంది నన్ను చేసుకుంటామని వచ్చారో... నన్ను చేసుకోవడమే అదృష్టమని వెంటపడ్డారు. తెలుసా...?'' అనసూయ నెత్తిమీద నీళ్ళకుండని పగలగొట్టడానికి సిద్ధపడుతూ అంది.

''నిజమే. వాళ్ళు అదృష్టవంతులే...''

''అంటే.. మీ ఉద్దేశ్యం...?'' అనసూయ నెత్తిన నీళ్ళకుండ పగిలింది.

''ఆ దిక్కుమాలిన ఏడుపు ఆపవే ముందు. ఈ సంబంధానికైనా నీ కొడుకుని ఒప్పించి తగలడు. ఇదిగో వాళ్ళు రాసిన ఉత్తరం. ఇందులో అమ్మాయి గురించిన వివరాలున్నాయి. నువ్వు, నీ పుత్రరత్నం చదువుకోండి'' ఉత్తరాన్ని అనసూయ మీద విసిరేసి అక్కడ నుంచీ వెళ్ళిపోయాడు పరంధామయ్య.

మూతి మూడు వంకర్లు తిప్పుతూ ఉత్తరాన్ని అందుకుంది అనసూయ.

• • •

''రెండు రకాల స్వీట్లు, హాట్లు, పళ్ళు- పెళ్ళిచూపులు బాగానే అరేంజ్ చేసాడు నీ కాబోయే మామగారు...'' నాలుగో స్వీటుని లాగిస్తూ అన్నాడు పెళ్ళికొడుకు ఫ్రెండు సుబ్బారావు.

రాంబాబు స్నేహితుడి మాటల్ని సరిగా వినిపించుకోకుండానే 'ఊ' కొట్టాడు. అతని దృష్టంతా లోపలి గది గుమ్మం మీదే వుంది. పెళ్ళికూతురుని ఎప్పుడు తీసుకువస్తారో అని అటే చూస్తున్నాడు.

నాల్గురోజుల క్రితం తల్లి చూపించిన ఫోటో చూస్తూనే ఫ్లాట్‌గా పడిపోయాడు. తన 'కలల సుందరి' ఇన్నాళ్ళకి దొరికిందని సంబరపడిపోయాడు. ఆ అమ్మాయి ఫోటోలో చాలా అందంగా వుంది. గులాబీ రంగు ఛాయతో, చారడేసి కళ్ళతో, లక్కపిడత లాంటి ఎర్రని నోటితో, తుమ్మెద రెక్కల్లాంటి ముంగురులతో... చాలా అందంగా వుంది.

ఐశ్వర్యారాయ్ కంటే అందంగా వుంది అనుకున్నాడు మురిసిపోతూ. అమ్మాయి చదువు.. కట్నం.. వివరాలన్నీ కూడా బాగుండటంతో, రాంబాబు ఎగిరి గంతేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసాడు.

పరంధామయ్య నిశ్చింతగా నిట్టూర్చాడు.

ఓ శుభముహూర్తాన రాంబాబు తన తల్లీతండ్రితో, ప్రియమిత్రుడి సమేతంగా పెళ్ళిచూపుల కార్యక్రమానికి బయలుదేరి వెళ్ళాడు. అదిగో... ఇప్పుడా పెళ్ళిచూపుల ఘట్టమే రసవత్తరంగా జరుగుతోంది!

పెళ్ళిచూపులకు ముందు అల్పాహార విందు



మరింత రసవత్తరంగా సాగింది. అమ్మాయి తల్లీ తండ్రీ దగ్గరుండి మరీ కొసరి కొసరి తినిపించారు.

''గతికితే అతకదంటారు..'' సందేహంగా అన్నాడు పరంధామయ్య.

''ఆ.. అవన్నీ పాతరోజులు. పాత నమ్మకాలు, బావగారూ. ఇప్పుడు గతికితేనే అతుకుతుంది'' పరంధామయ్య ప్లేట్లో మరో రెండు స్వీట్లు వేస్తూ అన్నాడు పిల్లతండ్రి.

మొహమాట పడుతూనే తిన్నాడు పరంధామయ్య. పెళ్ళిచూపుల కార్యక్రమానికి వచ్చిన ఆ నలుగురూ భుక్తాయాసంతో అవస్థపడుతుండగా, మెల్లగా పెళ్ళి కూతురిని అక్కడకి తీసుకొచ్చారు.

ఆ అమ్మాయి ఒక కుర్చీలో తలవంచుకుని కూర్చుంది.

''మా అమ్మాయని చెప్పుకోడం కాదుగానీ, ఈ కాలం పిల్లల్లా కాదు. మగాళ్ళ ముందు తలెత్తదు...'' అంది అమ్మాయి తల్లి, అమ్మాయి పక్కనే నిలబడి.

రాంబాబు ఆ మాటలు విని మురిసిపోయాడు. 'ఆ అమ్మాయి అంత బుద్ధిమంతురాలన్నమాట' అని సంబరపడ్డాడు. అమ్మాయి మొహాన్ని ఓసారి తనివి తీరా చూద్దామని తెగ ప్రయత్నించాడు.

నేలలోకి పాతేసినట్లుగా తలవంచేసిన అమ్మాయి ముక్కుమొహం ఎలా వున్నాయో రాంబాబు చూళ్ళేకపోయాడు.

కుర్చీలో అటు జరిగి ఇటు జరిగీ చూసాడు. ఎటు జరిగి, ఏ యాంగిల్‌లో చూసినా వంచిన అమ్మాయి తల తప్ప, మొహం కనబడలేదు.

అంతలో ఆ పిల్ల బామ్మగారు·కాబోలు... ''మాకు పిల్లని ఎక్కువసేపు నలుగురిలో కూర్చోపెట్టే అలవాటులేదు నాయనా...'' అంటూ పిల్లని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

వెళ్ళేటప్పుడు వెనుక నుండీ అమ్మాయి జడ చూసి ముచ్చటపడిపోయాడు రాంబాబు. ''ఎంత పెద్ద జడో...'' అనుకున్నాడు ఆనందంగా ఆశ్చర్యపోతూ.

''అమ్మాయి కాస్త లావుగా వున్నట్టుంది. ఫోటోలో అలాలేదే...'' గొణిగింది అనసూయ.

అమ్మాయి తల్లి, అనసూయకి మరో స్వీటు ఆప్యాయంగా అందిస్తూ.. ''ఆ ఏంలావు? కాస్త బొద్దుగా వుంది అంతే. పట్టుచీర కట్టింది కదా, అందుకే అలా కనబడుతోందన్నమాట... నిజానికి మా అమ్మాయి లావుకాదు.'' అంది.

'కాబోలు' అనుకుంది అనసూయ.

''ఓసారి నేను మీ అమ్మాయితో మాట్లాడాలి'' అన్నాడు రాంబాబు అమ్మాయిని మరోసారి చూడాలన్న వంకతో.

పిల్ల తండ్రి రాంబాబుకి యాపిల్ ముక్కలు అందిస్తూ... ''మా అమ్మాయికి కాస్త సిగ్గు ఎక్కువ నాయనా.. పెళ్ళయ్యాక మాట్లాడుదువుగాన్లే.'' అన్నాడు.

రాంబాబు మెత్తబడ్డాడు. మాట్లాడకుండా కాబోయే మావగారు అందించిన యాపిల్ ముక్కలు తింటూ కూర్చున్నాడు.

ఇంటిల్లిపాదీ, రాంబాబుకీ- అతనివెంట వచ్చిన మిగతా ముగ్గురికీ ఎదురెదురు మర్యాదలు చేసి, వారిని ప్రసన్నులను చేసుకున్నారు.

''పిల్ల నచ్చినట్టేకదా- ముహూర్తాలు పెట్టుకుందామా-'' అని హడావుడి పెట్టేసారు రాంబాబుని.

అనసూయ, పరంధామయ్యలు 'ఏవంటావూ' అన్నట్టు కొడుకువైపుచూసారు. ఫోటోలోని అమ్మాయి మొహాన్ని గుర్తుచేసుకుంటూ, మెల్లగా తలూపాడు రాంబాబు.

అమ్మాయి తల్లీతండ్రి మొహాలు వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగిపోయాయి.

• • •

''పెళ్ళివారి నుండీ కబురొచ్చింది. ముహూర్తానికి వారంరోజులే టైముంది...'' హడావుడిగా ఇంటికొస్తూ, అనసూయతో అన్నాడు పరంధామయ్య.

''బొత్తిగా వారం రోజులేనా? ఎలా సరిపోతుందండీ- కార్డులు వేయించాలా? అందరికీ అందాలా?'' అనసూయ కంగారుగా అంది.

''దగ్గర్లో మరో మంచి ముహూర్తం లేదట. వీళ్ళిద్దరి పేరుమీద ఇదే బావుందట.''

''కుదరనన్నాళ్ళూ కుదరలేదు. కుదరలేదు అను





## నిద్ర

సైక్రియాటిస్ట్ దగ్గరకెళ్ళాడు విశ్వేష్.

''డాక్టర్, ప్రశాంతమైన గాఢనిద్ర పట్టాలంటే ఏం చేయాలి?''

''నిద్రపోయే పదినిముషాల ముందు భార్య గురించి ఆలోచించకూడదు. అప్పుడామె కలలోకి రాకుండా హాయిగా ఆదమరచి నిదురపోవచ్చు!''

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు (జె.జె.నగర్)

## జైల్

''ఏం ఆలోచిస్తున్నావు?'' అడిగాడో ఖైదీ మరో ఖైదీని.

''పోలీస్ స్టేషన్ నుండి తప్పించుకుంటే సెంట్రల్ జైల్లో వేశారు.''

''అయితే?''

''ఇక్కడినుండి తప్పించుకొంటే ఏ జైల్లో వేస్తారా అని!'' చెప్పాడా ఖైదీ.

- కొడిమ్యాల భాస్కర్ (తాడిచర్ల)

## కారణం!

కాలు విరిగి హాస్పిటల్లో వున్న రామయ్యని పరామర్శించటానికి వెళ్ళాడు తిక్కారావు.


''అసలెలా విరిగింది నీకాలు?''

''అరటితొక్క మీద కాలేసి...''

''జారిపడ్డావా? అరెరె... ఎంత పనయింది?'' బాధగా అన్నాడు.

''జారిపడింది నేను కాదు- మా ఆవిడ. నేను దాన్నిచూసి కిసుక్కున నవ్వానంతే!'' అసలు విషయం చెప్పాడు రామయ్య.

- చందూవంశీ (ప్రొద్దుటూరు)




కున్నాం. ఇప్పుడేమో ముంచుకొచ్చినట్టు పెళ్ళిపన్లకి టైమేలేదు...'' గొణుక్కుంది అనసూయ.

''నువ్వాసణుగుడు ఆపి, ముందు పన్లు చూడు. నేను వెళ్ళి కార్డులు వేయిస్తాను'' అంటూనే హడావుడిగా బయటికి వెళ్ళిపోయాడు పరంధామయ్య.

రాంబాబుకి ఆ వారం రోజులు ఎలా గడచిపోయాయో తెలియలేదు. ఓ అందాలరాశి తన భార్య కాబోతున్నందుకు పొంగిపోయాడు. తన స్నేహితులందరికీ చెప్పుకున్నాడు. గర్వంగా ఫోటో చూపించాడు. అందరూ అతన్ని అభినందిస్తుంటే సంతోషంతో ఉబ్బిపోయాడు.

బంధుమిత్ర సపరివారంగా పెళ్ళికి తరలివెళ్ళాడు రాంబాబు. పెళ్ళిలోకూడా ఆ అమ్మాయి తలెత్తలేదు. 'ఎంత వినయం, ఎంత బిడియం' అని రాంబాబు మురిసిపోయాడు. అలా మురిసి ముక్కలవుతూనే ఆ అమ్మాయి మెళ్ళో తాళి కట్టేసాడు.

• • •

మొదటి రాత్రి.. పెళ్ళికూతురి రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు రాంబాబు. ఈ రోజైనా భార్య అందాన్ని తనివితీరా చూడొచ్చు అనుకున్నాడు. చెంపకు చారెడున్న ఆ అందాల కళ్ళని ముద్దాడాలని, నల్లగా బారెడు పొడవున్న జడతో ఆడుకోవాలని తహతహలాడుతున్నాడు.

భళ్ళున తలుపులు తెరుచుకున్నాయి. పట్టుచీరతో లోపలికి అడుగుపెట్టింది సరోజ. సన్నజాజి మొగ్గలా వుంటుందనుకున్న సరోజ, లావుగా కనిపించేసరికి కాస్త నిరాశ పడ్డాడు రాంబాబు. పట్టుచీరతో పోటీపడుతూ మిడిసిపడాల్సిన ఒంటి ఛాయ వెలవెలబోతూ చామనఛాయలో దర్శనమిచ్చింది. అంటే పెళ్ళిచూపుల్లోనూ, పెళ్ళిలోనూ ఆ అమ్మాయికి మేకప్ వేసారన్నమాట.

ఆశాభంగాన్ని అణచుకొంటూ సరోజను సమీపించాడు రాంబాబు. చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి మంచంమీద కూర్చోబెట్టాడు. సరోజ తల వంచుకునే కూర్చుంది.

''పెళ్ళిచూపుల్లోనూ, పెళ్ళిలోనూ నీ సుందర వదనాన్ని నాకు చూపించనేలేదు. ఏదీ ఇప్పుడు కళ్ళారా చూడనీ...'' ఆమె గడ్డం పట్టుకుని తలపైకెత్తుతూ అనునయంగా అన్నాడు రాంబాబు.

సరోజ తలఎత్తి రాంబాబు వైపు చూసి నవ్వింది. రాంబాబు ఖంగుతిన్నాడు.

''ఇదేవిటీ ఫోటోలో అంత అందంగా వుంది. ఈ చారెడేసి కళ్ళు, ఆ బుల్లి ఎర్రని నోరు, సంపెంగ నాసిక... ఏవీ? ఆ కళ్ళేమిటీ చైనావాళ్ళ కళ్ళలా సన్నగా, ఆ పెదాలు నల్లగా లావుగా, ముక్కు చూస్తే చట్టిముక్కు...'' రాంబాబుకి ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది.

బలవంతాన కోపాన్ని అణచుకుంటూ, ''అప్పుడు ఉత్తరంలో పంపిన ఫోటో నీదికాదా?!'' అనడిగాడు.

''నాదే! అందరూ అదే అంటున్నారు. ఆ ఫోటో నిజంగా నీదేనా అని. రంభలా అందంగా వున్నానట కదా ఆ ఫోటోలో...'' అనంది సరోజ ఆనందంగా.

'అందుకేకదా తల్లి నేను మోసపోయింది...' అని మనసులోనే గొణుక్కున్నాడు.

''ఎక్కడ తీయించుకున్నావు ఆ ఫోటో?'' యధాలాపంగా అడిగాడు రాంబాబు.

సరోజ మంచం మీద బాసింపట్టు వేసుక్కూర్చుని హుషారుగా ఆ ఫోటో కథ విధానం చెప్పడం మొదలుపెట్టింది.

''అదొక గొప్ప ఫోటో స్టూడియో. అందవిహీనంగా వున్న వారిని కూడా అందంగా తీయడం ఆ స్టూడియో ప్రత్యేకత. వాళ్ళే మొహం కడిగి, తల దువ్వి మేకప్ వేసిమరీ ఫోటో తీస్తారు. వాళ్ళ ఫోటో తీసారంటే, ఎలాంటి కురూపులైనా రంభ కంటే అందంగా పడతారు. ప్రత్యేకించి పెళ్ళిచూపులకోసం ఫోటోలు తీయడం, ఆ స్టూడియో ప్రత్యేకత-'' అంది సరోజ గడగడా.

'తెలుస్తూనేవుంది, ఆ స్టూడియో ప్రత్యేకత ఎలాంటిదో' కసిగా అనుకున్నాడు రాంబాబు.

''మీకు ఆ ఫోటోనే పంపాం కాబట్టి, పెళ్ళిచూపుల్లో అసలు తలెత్తవద్దంది మా బామ్మ'' అసలు రహస్యం చెప్పేసింది సరోజ.

''అబ్బ! ఎంత తెలివైందో మీ బామ్మ.''

''అవునండీ... మా బామ్మ తెలివైందని మీకెలా తెలిసింది?!'' అడిగింది సరోజ ఆశ్చర్యంగా.

''నేను తెలివితక్కువవాణ్ణి కాబట్టి.''

''అవును, మా బామ్మ అది కూడా అంది'' చప్పున అనేసి, నాలుక కరుచుకుంది సరోజ.

రాంబాబు నిశ్శబ్దంగా తిట్టుకున్నాడు.

''అంటే ఆ స్టూడియోలో ఫోటోలు తీయించుకుని, ఆ ఫోటోలు పెళ్ళివారికి పంపితే, అవి వాళ్ళకి బ్రహ్మాండంగా నచ్చిపోతాయన్నమాట...'' అన్నాడు రాంబాబు.

''అవును! మా ఫ్రెండ్సందరూ కూడా అక్కడే ఫోటోలు దిగారు. వాళ్ళకి కూడా మంచి సంబంధాలు వచ్చి, పెళ్ళిళ్ళయిపోయాయి.''

''దురదృష్టవంతుణ్ణి నేనొక్కణ్ణే కాదన్నమాట...' గొణుక్కున్నాడు రాంబాబు.

★